నమస్తే తెలంగాణ

వరంగల్

5 | వరంగల్, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | WARANGAL


## • లక్నవరంలో సందడే సందడి



లక్నవరంలో పెద్ద బోటులో ప్రయాణిస్తున్న పర్యాటకులు

ములుగు జిల్లా గోవింద రావుపేట మండలంలోని లక్నవరం సరస్సు పర్యాటకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు కావడంతో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు వేలాడే వంతెనపై నడుస్తూ, స్పీడ్, పెద్ద బోట్లలో షికారు చేస్తూ ఎంజాయ్ చేశారు. సరస్సులోని ఐలాండ్లు, పచ్చని ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు.

**- గోవిందరావుపేట, సెప్టెంబర్ 22**

## • బొగతకు పర్యాటకుల తాకిడి



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని తెలంగాణ నయాగరా బొగత జలపాతానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. బొగత అందాలకు మంత్రముగ్ధులయ్యారు. జలపాతం వ్యూ పాయింట్‌లో కెమెరాలు, సెల్‌ఫోన్లతో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. స్విమ్మింగ్ పూల్‌లో దిగి ఈత కొడుతూ ఎంజాయ్ చేశారు.

**- వాజేడు, సెప్టెంబర్ 22**

# అంగరంగ వైభవంగా..

*ఆకట్టుకున్న ముల్కనూరు ప్రజా గ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలు*

- ఉత్సాహంగా కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం
- ఆంధ్రా నుంచి కుటుంబాలతో తరలివచ్చిన రచయితలు
- 'నమస్తే తెలంగాణ' ప్రయత్నానికి కవులు, పాఠకుల జేజేలు



భానుమూర్తి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, సండేబుక్ ఇంఛార్జి నాగరాజు, వేముల శ్రీనివాసులు

హనుమకొండ సబర్బన్, సెప్టెంబర్ 22 : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆదివారం ప్రజా గ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా 'నమస్తే తెలంగాణ – ములుకనూరు ప్రజా గ్రంథాలయం' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకకు వందలాది మంది కవులు, రచయితలు, పాఠకులు హాజరై 'నమస్తే తెలంగాణ' సాహిత్యాభివృద్ధి కోసం చేపట్టిన కథల పోటీల ప్రయత్నానికి జేజేలు పలికారు. ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన మహిళా రచయిత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వార్తా పత్రికలు సాహిత్య మూలాలను పూర్తిగా వెనక్కి నెట్టేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో 'నమస్తే తెలంగాణ' కథల పోటీలు నిర్వహించడంతో పాటు వాటిని తమ పత్రికలో ప్రచురించడం అభినందనీయమన్నారు. ఉదయం 11 గంటలకు మొదలైన కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా పాల్గొన్న యువతీ యువకులు చివరి వరకు కూర్చున్నారు. కథా పోటీల్లో విజేతలైన రచయితలు తమ కుటుంబసభ్యులతో పాటు వేడుకకు హాజరయ్యారు. ప్రజా గ్రంథాలయానికి పలువురు కవులు, ఆహుతులు విరాళాలు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గ్రంథాలయానికి పలు పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా మత్తి భానుమూర్తి రచించిన 'జాయ సేనాపతి' చారిత్రక కాల్పనిక నవలను సభా వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ 'నమస్తే తెలంగాణ' ఆదివారం అనుబంధం 'బతుకమ్మ'లో ప్రతివారం నవల ప్రచురితమవుతుందన్నారు. 'నమస్తే తెలంగాణ'తోనే తనకు గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చర్చాగోష్టిలో కవులు, రచయితలు పాల్గొన్నారు. క్విజ్ పోటీల విజేతలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ బహుమతులు అందజేశారు. అంతకంటే ముందు ముల్కనూరు సాహితీ పీఠం ఏర్పాటు చేసిన డోలు కళాకారుల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు, కళాకారులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొమ్మిడి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



క్విజ్ పోటీలో విజేతకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



ఇష్టాగోష్టిలో పాల్గొన్న కవులు, రచయితలు

- వచ్చే నెలలో విక్రయానికి నోటిఫికేషన్
- ఇప్పటికే 12 సార్లు 800 ప్లాట్ల అమ్మకం
- సమకూరిన రూ. 400 కోట్ల ఆదాయం
- తాజాగా 10 ఎకరాల్లో 80 ప్లాట్ల వేలానికి కార్యాచరణ



# కుడా.. నిధుల వేట

## ఓ సిటీలో మరోసారి ప్లాట్ల వేలానికి ఏర్పాట్లు

**కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మరోసారి నిధుల వేటలో పడింది. వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలోని విలువైన భూముల అమ్మకంతో నిధులు పోగేసుకుంటున్నది. ఇదే క్రమంలో ఓ సిటీలోని మిగిలిన ప్లాట్లకు వచ్చే నెలలో వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ నుంచి కొనుగోలు చేసిన 120 ఎకరాల విస్తీర్ణంలోని ఓ సిటీలో ఇప్పటి వరకు 100 ఎకరాలను 800 ప్లాట్లుగా చేసిన కుడా 12 విడతల్లో విక్రయించింది. ఇందులో మిగిలిన 10 ఎకరాలను మిల్లు కార్మికుల ఇంటి స్థలాల కోసం కేటాయించగా, మరో 10 ఎకరాలను 80 ప్లాట్లుగా చేసి చివరిసారి వేలం నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వీటిలో 30 కమర్షియల్, 50 రెసిడెన్షియల్ ప్లాట్లు ఉండనున్నాయి. రెసిడెన్షియల్ కేటగిరీలో గజానికి రూ. లక్ష, కమర్షియల్‌కు రూ.1.50 లక్షల చొప్పన కుడా ప్రాథమికంగా ధరను నిర్ణయించినట్లు తెలిసింది.**

**-వరంగల్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

చారిత్రక వరంగల్ నగరంలో కుడా చేపట్టిన ఓ సిటీ ప్రాజెక్టు ఈ ప్రాంతాన్ని కొత్తగా అభివృద్ధి చేసింది. అన్ని వసతులతో ఉండే కాలనీలు, ఇండ్ల సముదాయాలు అప్పటి వరకు హనుమకొండలోనే ఉంటాయనే అభిప్రాయం ఈ ప్రాజెక్టుతో మారిపోయింది. ఈ ప్రాంతం వరంగల్‌లో ముఖ్యమైనది కావడంతో ఇందులోని ప్లాట్లకు భారీగా డిమాండ్ వచ్చింది. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ప్రభుత్వ సంస్థ కావడంతో న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని, బ్యాంకు లోన్లు సులభంగా వస్తాయనే ఉద్దేశంతో ప్లాట్ల కొనుగోలుకు చాలా మంది పోటీ పడ్డారు. ఈ పోటీ కుడాకు భారీగా నిధులు తెచ్చి పెట్టింది. వ్యాపారులు, ఎన్‌ఆర్‌ఐలు, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలకు చెందిన వారు ప్లాట్లు కొనుగోలు చేసి భారీ, విలాసవంతమైన భవనాలు నిర్మించారు.

**భారీగా ధరలు..**

వరంగల్‌లో ఉపాధి కేంద్రంగా నిలిచిన అజంజాహీ మిల్లు మూత పడిన తర్వాత దీనికి సంబంధించిన 120 ఎకరాల భూమిని నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ నుంచి 2007లో కుడా కొనుగోలు చేసింది. ఎస్‌బీఐ నుంచి రూ.50 కోట్ల లోను తీసుకుని ఓ సిటీ పేరిట ఖరీదైన ప్లాట్లుగా అభివృద్ధి చేసింది.



ఈ వెంచర్‌లో పార్కులు, మినీ స్టేడియం, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు లాంటి మౌలిక వసతులు కల్పించి 2007లోనే తొలిసారి వేలం నిర్వహించింది. అప్పుడు గజం ధర రూ. 3 వేలుండగా, 2022లో 12వ సారి వేలంలో రెసిడెన్షియల్ ప్లాట్ గజం రూ.80 వేలు, కమర్షియల్ రూ. లక్ష పలికింది. ఓ సిటీ ప్రాజెక్టు కుడాకు ఇప్పటికే దాదాపు రూ.400 కోట్లను ఆర్జించి పెట్టింది.

## కేఎంసీలో మెడికోలకు పోటీలు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 22 : కాకతీయ మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉత్కర్ష–24లో భాగంగా వైద్య విద్యార్థులకు ఆదివారం పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని మట్టితో వివిధ రకాల కళాకృతులను తయారు చేశారు. ముఖ్యంగా విద్యార్థుల సూక్ష్మ కళ ప్రతిభకు కళాశాల బోధనా బృందం ప్రశంసలు కురిపించింది. విజేతలను అభినందించింది. సోమవారం ఇంపల్స్ కార్యక్రమంతోపాటు సామాజిక అవగాహన కల్పిస్తూ మెడికోలు రూపొందించిన షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శన ఉంటుందని నిర్వాహక కమిటీ తెలిపింది.



**వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పీడీఎస్ రైస్ అక్రమ రవాణా ఆగడం లేదు. టన్నుల కొద్దీ బియ్యాన్ని ఒక దగ్గర డంపింగ్ చేసి రాత్రికి రాత్రే సరిహద్దులు దాటిస్తున్నారు. ప్రధానంగా వరంగల్ నగర శివారు ప్రాంతాలు, వర్ధన్నపేట, నర్సంపేట, జనగామ, పరకాల ప్రాంతాల్లో ఎక్కువగా ప్రజాపంపిణీ బియ్యం దందా జరుగుతున్నది. దీనికి కొందరు ఇన్‌స్పెక్టర్లు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా కొందరు రైస్‌మిల్లర్లు ప్రజాపంపిణీ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా రీసైక్లింగ్ చేస్తూ అక్రమాలకు తెర తీస్తున్నారు.**

**- సుబేదారి, సెప్టెంబర్22**

# ఆగని బియ్యం దందా

## బ్లాక్ మార్కెట్లోకి పీడీఎస్ రైస్

- డంపింగ్ స్థలాల నుంచి బయటి రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలింపు
- అక్రమ రవాణాకు కొందరు ఇన్‌స్పెక్టర్లు సహకరిస్తున్నట్లు ఆరోపణలు
- రీసైక్లింగ్‌కు పాల్పడుతున్న రైస్‌మిల్లర్లు

హసన్‌పర్తికి చెందిన ఓ వ్యక్తి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో ఆరితేరి ప్రత్యేక ముఠా ను ఏర్పాటు చేసుకొని కొందరు ఇన్‌స్పెక్టర్ల అండతో కోట్ల రూపాయలు సంపాదించినట్లు తెలుస్తున్నది. కిరాయి మనుషులతో ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాల్లో రేషన్ డీలర్లు, కిరాణా షాప్‌లు, లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు తీసుకొని హసన్‌పర్తి, దేవన్నపేట, ఉనికిచర్ల, చింతగట్టు, ఔటర్ రింగ్ చుట్టుపక్కల వెంచర్లు, ఖాళీ ప్లాట్లు, క్రషర్లు ఉన్న ప్రాంతాల్లో టన్నుల కొద్దీ డంపింగ్ చేసి రాత్రికిరాత్రే లారీల్లో పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. రేగొండ మండలానికి చెందిన ఇద్దరు, ములుగు ఘన్‌పూర్‌కు చెందిన మరొకరు పెద్ద మొత్తంలో రేషన్ డీలర్లు, లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.8 చొప్పున కొనుగోలు చేస్తూ బ్లాక్ మార్కెట్‌లో రూ. 20కి విక్రయిస్తున్నారు. నర్సంపేట, వర్ధన్నపేట ప్రాంతాల్లో కొందరు రైస్‌మిల్లర్లు రేషన్ డీలర్స్ నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి తమ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి నాణ్యత బియ్యం పేరుతో వ్యాపారం చేస్తున్నారు.

**కొందరు ఇన్‌స్పెక్టర్ల సపోర్ట్**

నగర శివారు ప్రాంతాలకు చెందిన ఐదు పోలీస్ స్టేషన్ అధికారులు, ఓ ఏసీపీకి కొద్ది నెలల నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు అందుతున్నట్లు తెలుస్తున్నది. ఏడాది క్రితం బదిలీ అయిన ఓ పోలీసు ఉన్నతాధికారి నిఘా వర్గాల ద్వారా విచారణ జరిపించి అతడితో సంబంధాలున్న ఇన్‌స్పెక్టర్లను మందలించినట్లు సమాచారం. ఆయన బదిలీ కావడంతో మళ్లీ దందాకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేగొండ మండలం చిన్నకోడపాక, శాయంపేట మండలం కొప్పుల, ములుగు ఘన్‌పూర్‌కు చెందిన వారికి ఆయా ప్రాంతాల పోలీసులతో సంబంధాలున్నట్లు తెలుస్తున్నది. జనగామ ప్రాంతంలో భువనగిరికి చెందిన వ్యక్తి పీడీఎస్ అక్రమ రవాణాలో సిద్ధహస్తుడని తెలిసింది. వీరంతా కోళ్లఫారాలు, రైస్‌మిల్లుల్లో రీసైక్లింగ్ బియ్యం తయారీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఏపీ, హైదరాబాద్‌లోని లిక్కర్ తయారీ కంపెనీలకు బియ్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం.

**సీపీ నజర్..**

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొద్ది రోజుల నుంచి నిఘా పెట్టి పక్కా సమాచారంతో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుంటున్నారు. వారం క్రితం వర్ధన్నపేటలోని మహేశ్వరి రైస్‌మిల్లులో రూ. 12.50 లక్షల విలువ చేసే 480 టన్ను లు, జనగామలో ఇంట్లో నిల్వ ఉంచిన రూ. 93 వేల విలువ చేసే 74 బస్తాలు, మడికొండ సమీపంలోని కోళ్లఫారంలో 27 క్వింటాళ్లు, పరకాలలో 10 లక్షల విలువ చేసే 360 క్వింటా ళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కొందరు ఇన్‌స్పెక్టర్లు టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేసే వారితో సమాచారం తెలుసుకొని పట్టుబడకుండా అలర్ట్‌చేసి సేఫ్‌జోన్‌లో డంపింగ్ చేసి రాత్రి రాత్రే బయటి ప్రాంతాలకు రవాణా చేయడానికి సహకరిస్తున్నట్లు సమాచారం. దీనికి లోడ్ చొప్పున అధిక మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది.



# విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**అధికారుల నిర్లక్ష్యంతోనేనని బంధువుల ఆందోళన**

గార్ల, సెప్టెంబర్ 22: పొట్టకూటి కోసం కూలి పనికి వెళ్లి విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పూమ్యతండాకు చెందిన గుగులోత్ నితిన్(20) ఆదివారం కౌలు రైతు పొలంలో పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. శనివారం రాత్రి గాలి దుమారంతో ఈదురు గాలులకు త్రీఫేస్ విద్యుత్ వైరు తెగి పొలంలో పడగా దాన్ని గమనించకుండా నితిన్ తాకడంతో షాక్‌తో మృతి చెందాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబసభ్యులు, గ్రామస్తులు కౌలు రైతు ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి రెండు గంటలపాటు ఆందోళన చేశారు. అనంతరం సబ్‌స్టేషన్ వద్దకు మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారికి నచ్చజెప్పారు. విద్యుత్ అధికారులతో చర్చించి మృతుడికి రావాల్సిన నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న వారికి నచ్చజెబుతున్న పోలీసులు

నితిన్(ఫైల్)

# ఏం కొనలేం.. ఏం తినలేం..


## వరద పాలైన పంటలు.. కూరగాయల ధరలకు రెక్కలు

*భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పంటలు*

- మానుకోట జిల్లాలో వెయ్యి ఎకరాల్లో నష్టం
- ఇబ్బంది పడుతున్న సామాన్యులు

**భారీ వర్షాలు కూరగాయలపైనా ప్రభావం చూపుతున్నాయి. వరి, పత్తి, మక్కజొన్న, మిర్చితో పాటు కూరగాయల పంటలు కొట్టుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లడంతో ధరలు పెరిగి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవల వరద బీభత్సానికి మహబూబాబాద్ జిల్లాలో బెండ, దొండ, టమాట, వంకాయ, బీరకాయ, దోసకాయ తోటలు కొట్టుకుపోగా మరికొన్ని చోట్ల నీట మునిగి పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. అలాగే జిల్లాకు పొరుగున ఉన్న సూర్యాపేట, కోదాడ సహా ఏపీలోని విజయవాడ, గుంటూరు నుంచి కూరగాయలు వస్తుంటాయి. అయితే అక్కడా వరదలు ముంచెత్తడంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చి మార్కెట్‌కు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. వరదలకు ముందు రూ.20 ఉన్న బెండకాయ ఇప్పుడు రూ.60కి, రూ.50 ఉన్న బీరకాయ రూ. 80 కి ఎగబాకడంతో గిట్లయితే 'ఏం కొనలేం.. ఏం తినలేం' అంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.**

*- మహబూబాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ)*



**ధరలు చూస్తే దడే..**



మానుకోటలో వరదలకు ముందు కూరగాయ ధరలు ఒక ఎత్తు అయితే వరదల తర్వాత విపరీతంగా కూరగాయల ధరలు పెరిగాయి. అన్ని రకాల కూరగాయ ధరలు పెరగడంతో ఏమి కొనేటట్టు లేదు. ఇప్పటికైనా కూరగాయ ధరలు తగ్గించకుంటే సామాన్యుడు బతుకుడు కష్టమే.

– బొల్లికొండ చిరంజీవి, మహబూబాబాద్

**కూరగాయల ధరలు (కిలోకు రూ.ల్లో)**

| | |
|---|---|
| బీరకాయ | 80 |
| బెండకాయ | 60 |
| వంకాయ | 60 |
| కాకరకాయ | 80 |
| టమాట | 60 |
| మంచి చిక్కుడు | 80 |
| గోరుచిక్కుడు | 60 |
| దొండకాయ | 80 |
| పచ్చిమిర్చి | 80 |
| దోసకాయ | 80 |
| కొత్తిమీర | 180 |
| ఆలుగడ్డ | 50 |
| క్యారెట్ | 80 |

జిల్లావ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించడంతో పాటు రోడ్లు తెగిపోయి, ఇండ్లు కూలిపోయి, పంటలు కొట్టుకుపోయి, చెరువులకు గండ్లు పడ్డాయి. అకస్మాత్తుగా వచ్చిన వరదలతో కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. వరదలకు ముందు, తర్వాత కూరగాయల ధరలు పరిశీలిస్తే ఆకాశాన్నంటాయి. జిల్లాకు కూరగాయలు విజయవాడ, కోదాడ, సూర్యాపేట ప్రాంతాల నుంచి వస్తాయి. ఇటీవల ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాతో పాటు పక్క రాష్ట్రమైన ఏపీలోని విజయవాడ, గుంటూరు జిల్లాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉంది. అక్కడ కూడా కూరగాయల పంటలు దెబ్బతినడంతో జిల్లాకు రవాణా నిలిచిపోయింది. జిల్లాకు చుట్టుపక్క ప్రాంతమైన సూర్యాపేట, కోదాడలో కూడా వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిగిలిన కొద్దిపాటి కూరగాయలకు మార్కెట్‌కు డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో 1000 ఎకరాల్లో సాగవుతున్న కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆకుకూరలు, కొత్తిమీర, పుదీనా, మెంతికూర.. ఇలా ఏది ముట్టుకున్నా రూ.50 పై మాటే.. వరదలకు ముందు రూ.20లకు కిలో ఉన్న బెండకాయ వేగంగా రూ.60కు చేరింది. కాకరకాయ రూ.50 నుంచి 80కి చేరింది. రూ.10కి కిలో ఉన్న టమాటల ధర రూ.60కి పెరిగింది. రూ.50లకు కిలో ఉన్న బీరకాయ ప్రస్తుతం రూ.80కి ఎగబాకింది. అకాల వర్షాలు, వరద బీభత్సంతో జిల్లాలో చాలా నష్టపోయిన రైతులు ఇప్పుడు తిందామంటే కొనలేని పరిస్థితిలో ఉన్నారు. ఒకవైపు పెరిగిన ధరలతో జనం సతమతమవుతుంటే దళారులు చేరి ధరలు మరింత పెంచి విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు కిలో కొనాల్సినవారు అర కిలో, అర కిలో కూరగాయలు కొనాలనుకున్న వారు పావు కిలో చొప్పున తీసుకునే పరిస్థితి ఏర్పడింది. వరదలతో అన్ని శాఖలు నష్టాల అంచనా కోసం తిరుగుతుండగా, నిత్యావసరాల వస్తువుల ధరల పెరుగుదలపై పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా అధికారులు కూరగాయలతో పాటు నిత్యావసరాల ధరలను అదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.